Send your Feedback to vidya@sakshi.com

సాక్షి విద్య

• ఈ వారం విద్యలో..

సోమవారం	మంగళవారం	బుధవారం	గురువారం	శుక్రవారం	శనివారం	ఆదివారం
జనరల్ స్టడీస్/ఆర్ఆర్‌బీ Tenth Class Special	జనరల్ స్టడీస్/ఆర్ఆర్‌బీ Tenth Class Special	జేఈఈ-మెయిన్ Tenth Class Special	జనరల్ స్టడీస్/ఆర్ఆర్‌బీ Tenth Class Special	జనరల్ స్టడీస్/ఆర్ఆర్‌బీ Tenth Class Special	జనరల్ స్టడీస్/ఆర్ఆర్‌బీ Tenth Class Special	లెర్న్ ఇంగ్లిష్/ Learn English Tenth Class Special

భారత రాష్ట్రపతిగా అత్యధిక సార్లు పోటీచేసిన వ్యక్తి?

కొప్పుల మల్లేశం

అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ కళాశాల.

జనరల్ స్టడీస్ ఇండియన్ పాలిటీ ప్రత్యేకం

భారత రాష్ట్రపతి

1. భారతదేశంలో పరిపాలన మొత్తం రాష్ట్రపతి పేరు మీదనే కొనసాగుతుందని తెలిపే అధికరణ?
1) 53 2) 74 3) 75 4) 77

జ. 4;

వివరణ: అధికరణ-77 ప్రకారం దేశ పరిపాలన మొత్తం రాష్ట్రపతి పేరు మీదనే కొనసాగుతుంది. దీనిని అమెరికా రాజ్యాంగం నుంచి స్వీకరించాం. అధికరణ-53 ప్రకారం దేశంలో కార్యనిర్వహణ అధికారాలు రాష్ట్రపతికే చెందుతుందని తెలుపుతుంది. అధికరణ-74(1) ప్రకారం రాష్ట్రపతి ఈ అధికారాన్ని చెలాయించటానికి ప్రధానమంత్రి అధ్యక్షతన మంత్రి మండలి సలహా ఇస్తుందని తెలుపుతుంది. దీని ప్రకారం రాష్ట్రపతి నామమాత్రపు అధికారి కాగా, ప్రధానమంత్రి వాస్తవ అధికారిగా ఉంటాడు.

2. రాష్ట్రపతి ఎన్నిక విధానాన్ని ఏ దేశ రాజ్యాంగం నుంచి స్వీకరించాం?
1. ఫ్రాన్స్ 2. ఐర్లాండ్
3. అమెరికా 4. నార్వే

జ. 2;

వివరణ: రాష్ట్రపతి ఎన్నిక విధానాన్ని ఐర్లాండ్ రాజ్యాంగం నుంచి స్వీకరించాం. దీన్ని రాజ్యాంగ పరిషత్‌లో ఎన్. గోపాల స్వామి అయ్యంగార్ ప్రతిపాదించాడు. రాష్ట్రపతి ఎన్నికను ఎన్నికల సంఘం నిర్వహిస్తుంది. దీనికి లోక్‌సభ సెక్రటరీ జనరల్ ఒకసారి, రాజ్యసభ సెక్రటరీ జనరల్ మరోసారి రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తారు. రాష్ట్రపతి ఎన్నిక నైష్పత్తిక ప్రాతినిధ్య ఓటు బదిలీ పద్ధతి ప్రకారం నిర్వహిస్తారు.

3. రాష్ట్రపతిని ఎన్నుకునే 'ఎన్నికల గణం'లో కింది వారిలో సభ్యులు కానివారు?
1. పార్లమెంట్ ఉభయసభలకు ఎన్నికైన సభ్యులు
2. పార్లమెంట్ ఉభయసభలకు నియామక సభ్యులు
3. అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికైన సభ్యులు
4. కేంద్ర పాలిత ప్రాంతాల అసెంబ్లీలకు ఎన్నికైన సభ్యులు

జ. 2;

వివరణ: రాష్ట్రపతిని ఎన్నుకునేందుకు ఎన్నికల గణం (Electrol college) ఏర్పడుతుంది. ఇందులో కేంద్ర, రాష్ట్ర స్థాయిలో చట్టసభలకు ఎన్నికైన సభ్యులకే, అవకాశం ఉంటుంది. పార్లమెంట్ ఉభయసభలకు; అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు; ఢిల్లీ, పుదుచ్చేరి, జమ్మూ కశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతాల అసెంబ్లీలకు ఎన్నికైన సభ్యులకు అవకాశం ఉంటుంది. అదే విధంగా లోక్‌సభకు నియమించబడిన ఆంగ్లో-ఇండియన్ సభ్యులకు, రాజ్యసభకు నియమించబడిన విశిష్ట వ్యక్తులకు, రాష్ట్రాల అసెంబ్లీలకు నియమించబడిన ఆంగ్లో-ఇండియన్ సభ్యులకు, రాష్ట్రాల విధాన పరిషత్‌కు ఎన్నికైన, నియామక సభ్యులకు సభ్యత్వం ఉండదు.

4. కింది వాటిలో భారత రాష్ట్రపతి అధికారం కానిది?
1) సమన్ 2) ప్రోరోగ్
3) డిజల్యూషన్ 4) అడ్జర్న్

జ. 4;

వివరణ: 'అడ్జర్న్' అంటే సభను తాత్కాలికంగా వాయిదా వేయడం. లోక్‌సభను అడ్జర్న్ చేసే అధికారం లోక్‌సభ స్పీకర్‌కు ఉంటుంది.

'సమన్' అంటే పార్లమెంట్‌ను సమావేశపరచటం; 'ప్రోరోగ్' అంటే పార్లమెంట్ సమావేశాలు ముగిశాయని ప్రకటించడం లేదా దీర్ఘకాలికంగా వాయిదా వేయటం; డిజల్యూషన్ అంటే ప్రధాని సలహాపై రాష్ట్రపతి లోక్‌సభను రద్దు చేయటం. ఈ మూడు అధికారాలు భారత రాజ్యాంగం ప్రకారం రాష్ట్రపతికే కల్పించారు.

5. భారత రాష్ట్రపతికి కింది వాటిలో ఏ రకమైన వీటో అధికారం లేదు?
1) నిరపేక్ష వీటో 2) సస్పెన్సివ్ వీటో
3) పాకెట్ వీటో 4) క్వాలిఫైడ్ వీటో

జ. 4;

వివరణ: వీటో అంటే తిరస్కారం అని అర్థం. భారత రాష్ట్రపతికి ఈ కింది మూడు రకాల వీటో అధికారాలు ఉంటాయి.

ఎ) నిరపేక్ష వీటో: రాష్ట్రాల అసెంబ్లీలు ఆమోదించిన బిల్లులను ఆ రాష్ట్ర గవర్నర్ రాష్ట్రపతి అనుమతికి రిజర్వ్ చేసిన బిల్లులను, పార్లమెంట్ ఆమోదించిన ప్రైవేట్ సభ్యుని బిల్లులను తిరస్కరించే అధికారం రాష్ట్రపతికి ఉంటుంది. దీనినే నిరపేక్ష వీటో అంటారు.

బి) సస్పెన్సివ్ వీటో: పార్లమెంట్ ఆమోదించిన సాధారణ బిల్లులను రాష్ట్రపతి మళ్లీ పార్లమెంట్‌కు పునఃపరిశీలనకై పంపవచ్చు. ఒకవేళ అదే బిల్లును మార్పులతో గాని లేదా మార్పులు లేకుండా గాని తిప్పి పంపినప్పుడు రాష్ట్రపతి తప్పకుండా సంతకం చేయాలి.

సి) పాకెట్ వీటో: పార్లమెంట్ ఆమోదించిన బిల్లుకు తన ఆమోదాన్ని, తిరస్కారాన్ని తెలుపకుండా రాష్ట్రపతి ఆ బిల్లుని తన వద్దే ఉంచుకోవడాన్ని పాకెట్ వీటో అంటారు. రాజీవ్ గాంధీ ప్రవేశపెట్టిన పోస్టల్ బిల్లుపై నాటి రాష్ట్రపతి జైల్‌సింగ్ పాకెట్ వీటో ప్రయోగించాడు. అమెరికా అధ్యక్షుడికి ఉండే **క్వాలిఫైడ్ వీటో** భారత రాష్ట్రపతికి లేదు.

6. భారత రాష్ట్రపతి ఎన్నికల్లో రెండో లెక్కింపు ద్వారా ఎన్నికైన ఏకైక రాష్ట్రపతి ఎవరు?
1) నీలం సంజీవరెడ్డి 2) వి.వి. గిరి
3) ఫకృద్దీన్ అలీ అహ్మద్
4) ఆర్.వెంకట్రామన్

జ. 2;

వివరణ: రాష్ట్రపతిని నైష్పత్తిక ప్రాతినిధ్య పద్ధతి ప్రకారం ఎన్నుకుంటారు. ఈ పద్ధతి ప్రకారం కనీసం 50% ఓట్లు గెలుచుకున్న వారే రాష్ట్రపతిగా ఎన్నికవుతారు. ఒకవేళ మొదటి లెక్కింపులో ఎవరికీ 50% రానప్పుడు రెండో లెక్కింపు చేపడతారు. అప్పుడు కూడా రానిచో మూడో లెక్కింపు చేపట్టి 50% ఓట్లు వచ్చే వరకు లెక్కించి విజేతను ప్రకటిస్తారు.

1969లో ఐదో రాష్ట్రపతి ఎన్నికల్లో మొదటి లెక్కింపులో ఎవరికి కూడా 50% ఓట్లు రాలేదు. వి.వి. గిరి మొదటి స్థానంలో, నీలం సంజీవ రెడ్డి రెండో స్థానంలో, సి.డి. దేశ్‌ముఖ్ మూడో స్థానంలో నిలిచినప్పటికీ ఎవరికి 50% ఓట్లు రాలేదు. అప్పుడు సి.డి. దేశ్‌ముఖ్‌కు లభించిన ఓట్లను రెండో ప్రాధాన్యత ప్రకారం పంచగా స్వతంత్ర అభ్యర్థి వి.వి.గిరికి 50.9% ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి నీలం సంజీవరెడ్డికి 49.1% లభించాయి. ఈ విధంగా రెండో లెక్కింపు ద్వారా వి.వి. గిరి రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు.

7. కింది ఏ బిల్లులు విషయంలో రెండు సభల మధ్య వైరుధ్యం వస్తే రాష్ట్రపతి సంయుక్త సమావేశంను ఏర్పాటు చేస్తాడు?
1) సాధారణ బిల్లు 2) ద్రవ్య బిల్లు
3) రాజ్యాంగ సవరణ బిల్లు
4) పైవన్నీ

జ. 1;

వివరణ: సాధారణ బిల్లుల ఆమోదంలో పార్లమెంట్ ఉభయసభల మధ్య వైరుధ్యం అంటే ఒక సభ ఆమోదించి, మరో సభ ఆమోదించినప్పుడు రాష్ట్రపతి ఆర్టికల్ 108 ప్రకారం సంయుక్త సమావేశం ఏర్పాటు చేస్తాడు. స్పీకర్ అధ్యక్షత వహించే సంయుక్త సమావేశంలో బిల్లుకు మెజారిటీ సభ్యులు మద్దతు తెలిపితే చట్టం అవుతుంది. లేనిచో బిల్లు వీగిపోతుంది.

ఇప్పటి వరకు మూడు సార్లు సంయుక్త సమావేశాలు జరుగగా మూడు సార్లు బిల్లులు ఆమోదించబడ్డాయి. అవి
1. వరకట్న నిషేధ బిల్లు (1961)
2. బ్యాంకింగ్ సర్వీస్ కమిషన్ రద్దు (1978)
3. పోటా బిల్లు (2002)

8. భారత రాష్ట్రపతి ఏ సందర్భంలో ఆర్డినెన్స్ జారీ చేస్తాడు?
1) పార్లమెంట్ సమావేశంలో ఉన్నప్పుడు
2) పార్లమెంట్ సమావేశంలో లేనప్పుడు
3) పార్లమెంట్ బడ్జెట్ సమావేశంలో ఉన్నప్పుడు
4) పార్లమెంట్ శీతాకాల సమావేశంలో ఉన్నప్పుడు

జ. 2;

వివరణ: పార్లమెంట్ సమావేశంలో లేని సందర్భాన్ని 'రిసెస్' అంటారు. ఈ సందర్భంలో అత్యవసరంగా శాసనం అవసరం అయితే రాష్ట్రపతి క్యాబినేట్ సలహా ప్రకారం ఆర్టికల్-123 ప్రకారం ఆర్డినెన్స్ జారీ చేస్తాడు. దీనినే అత్యవసర శాసనం లేదా రాష్ట్రపతి జారీచేసే శాసనం అంటారు. దీని కాలపరిమితి 6 నెలలు. పార్లమెంట్ సమావేశం అయిన తర్వాత 6 వారాల్లోపు దీనిని ఆమోదిస్తే చట్టం అవుతుంది. భారత రాష్ట్రపతి కేంద్ర జాబితా, ఉమ్మడి జాబితా, అవశిష్ట అంశాలపై ఆర్డినెన్స్ జారీ చేస్తాడు.

9. భారత రాష్ట్రపతి సుప్రీంకోర్టు సలహాను కోరే అంశాన్ని ఏ రాజ్యాంగం నుంచి స్వీకరించాం?
1) ఫ్రాన్స్ 2) అమెరికా
3) ఐర్లాండ్ 4) కెనడా

జ. 4;

వివరణ: దేశంలో ఏదైన అంశంపై న్యాయ సలహాకై రాష్ట్రపతి ఆర్టికల్-143 ప్రకారం సుప్రీంకోర్టు సలహా కోరవచ్చు. దీనిని కెనడా నుంచి స్వీకరించాం. సుప్రీంకోర్టు ఐదుగురు జడ్జీల బెంచ్ సలహా ఇస్తుంది. ఇది కేవలం సలహాపరమైంది మాత్రమే. రాష్ట్రపతి దీనికి కట్టుబడి ఉండనవసరం లేదు.

ఇప్పటికి వివిధ సందర్భాల్లో భారత రాష్ట్రపతులు 15 సార్లు సుప్రీంకోర్టు సలహా కోరారు. 1951లో ఢిల్లీ న్యాయ చట్టం, 1958లో కేరళ విద్యా బిల్లు విషయంలో, 1960లో బేరుబరి వివాదంలో రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ సుప్రీంకోర్టు సలహా కోరాడు. 2012లో 2జీ స్పెక్ట్రం వివాదంలో కూడా రాష్ట్రపతి సుప్రీంకోర్టు సలహా కోరాడు. అత్యధిక సార్లు సుప్రీంకోర్టు సలహా కోరిన రాష్ట్రపతి బాబు రాజేంద్రప్రసాద్.

10. భారతదేశంలో జాతీయ అత్యవసర పరిస్థితిని ఎన్నిసార్లు విధించారు?
1) 1 2) 2 3) 3 4) 4

జ. 3;

వివరణ: యుద్ధం, విదేశీ దాడి, సాయుధ తిరుగుబాటు సందర్భంలో ప్రధాని నేతృత్వంలో కేంద్ర క్యాబినేట్ లిఖిత సలహా ప్రకారం రాష్ట్రపతి ఆర్టికల్-352 ప్రకారం జాతీయ అత్యవసర పరిస్థితిని విధిస్తాడు. ఇప్పటి వరకు దీనిని మూడు సార్లు విధించారు. అవి
1) 1962 అక్టోబర్ 26న భారత్‌పై చైనా దాడి సందర్భంగా నాటి ప్రధాని నెహ్రూ సలహా ప్రకారం రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ విధించాడు.
2) 1971 డిసెంబర్ 3న భారత్-పాక్ యుద్ధ సందర్భంలో ప్రధాని ఇందిరా గాంధీ సలహా ప్రకారం నాటి రాష్ట్రపతి వి.వి. గిరి విధించాడు.
3) 1975 జూన్ 25న అంతర్గత కల్లోలం కారణంగా ప్రధాని ఇందిరా గాంధీ సలహా ప్రకారం నాటి రాష్ట్రపతి ఫకృద్దీన్ అలీ అహ్మద్ జాతీయ అత్యవసర పరిస్థితిని విధించాడు.

11. ప్రభుత్వానికి అత్యవసర ఖర్చు నిమిత్తం భారత రాష్ట్రపతి వద్ద ఉండే ప్రత్యేక నిధి?
1) భారత సంఘటిత నిధి
2) భారత అగంతుక నిధి
3) భారత ప్రభుత్వ ఖాతా
4) పైవన్నీ సరైనవే

జ. 2;

వివరణ: రాజ్యాంగంలోని ఆర్టికల్-267 ప్రకారం భారత అగంతుక నిధి ఏర్పడింది. దీనినే అత్యవసర నిధి లేదా ఆపత్కాల నిధి అని కూడా అంటారు. ప్రకృతి వైపరిత్యాలు, క్షామం వంటి సందర్భాల్లో అత్యవసరంగా వ్యయం చెల్లించడానికి రాష్ట్రపతి వద్ద ఈ ఆగంతుక నిధిని, 1950-ఆగంతుక నిధి చట్టం ప్రకారం ప్రారంభించబడింది. దీని నుంచి చెల్లించే చెల్లింపులకు పార్లమెంట్ అనుమతి తర్వాత పొందవచ్చు. రాష్ట్ర స్థాయిలో రాష్ట్ర ఆగంతుక నిధి గవర్నర్ వద్ద ఉంటుంది.

12. భారత రాజ్యాంగంలోని ఏ ఆర్టికల్‌ను బి.ఆర్. అంబేడ్కర్ 'మృత పత్రంగా' పేర్కొన్నారు?
1) 352 2) 356
3) 360 4) పైవన్నీ

జ. 2;

వివరణ: భారత రాజ్యాంగంలోని రాష్ట్రపతి పాలన గురించి తెలిపే ఆర్టికల్ - 356ను బి.ఆర్.అంబేడ్కర్ మృత పత్రంగా పేర్కొన్నాడు. రాజ్యాంగ పరిషత్‌లో చర్చ సందర్భంగా దీనిని భవిష్యత్తులో దుర్వినియోగం చేసే ప్రమాదం ఉందని సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు, దానికి అంబేడ్కర్ ఈ ఆర్టికల్ దేశభద్రతకు ఐక్యతకు అవసరం. అదే విధంగా దీనిని ఎప్పుడు వినియోగించని ఆర్టికల్‌గా ఒక 'మృత పత్రంగా' మిగిలిపోతుందని వ్యాఖ్యానించాడు.

13. సుప్రీంకోర్టు ఏ కేసులో ఇచ్చిన తీర్పు తర్వాత రాష్ట్రపతి పాలన విధించడం (ఆర్టికల్-356) తగ్గింది?
1) ఇందిరాసహానీ కేసు
2) రామ్‌లాల్ కేసు
3) కేశవానంద భారతీ కేసు
4) ఎస్.ఆర్.బొమ్మై కేసు

జ. 4;

వివరణ: సరైన కారణం లేకుండా ఇష్టానుసారంగా రాష్ట్రపతి పాలన విధిస్తే న్యాయసమీక్ష చేసే అధికారం తనకు ఉందని సుప్రీంకోర్టు 1994 మార్చి 11న ఎస్.ఆర్. బొమ్మై కేసులో తీర్పునిచ్చింది. జస్టిస్ కుల్‌దీప్ సింగ్ నేతృత్వంలో 9 మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం తీర్పునిస్తూ లౌకికతత్వం, సమాఖ్య భారత రాజ్యాంగ మౌలిక పునాది అని పేర్కొంటూ వీటికి విఘాతం కలిగిస్తే రాష్ట్రపతి పాలన విధించవచ్చని తీర్పునిస్తూ దుర్వినియోగం మాత్రం చేయవద్దని వ్యాఖ్యానించింది. ఎస్ఆర్ బొమ్మై కేసు తర్వాత రాష్ట్రపతి పాలన విధింపు దుర్వినియోగం తగ్గింది.

14. ఏకగ్రీవంగా ఎన్నికైన ఏకైక రాష్ట్రపతి ఎవరు?
1) బాబు రాజేంద్రప్రసాద్
2) జాకీర్ హుస్సేన్
3) నీలం సంజీవరెడ్డి 4) జ్ఞానీ జైల్‌సింగ్

జ. 3;

వివరణ: భారత రాష్ట్రపతి పదవికి 15సార్లు ఎన్నికలు నిర్వహించగా ఒకేఒకసారి 1977లో ఎన్నిక లేకుండా ఏకగ్రీవం జరిగింది. నీలం సంజీవరెడ్డి ఎలాంటి పోటీ లేకుండా ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. 1977లో రాష్ట్రపతి ఫకృద్దీన్ అలీ అహ్మద్ మరణంతో రాష్ట్రపతి ఎన్నిక నిర్వహించారు. నీలం సంజీవరెడ్డి జనతా పార్టీ మద్దతుతో నామినేషన్ వేయగా మరో 36 మంది నామినేషన్ వేసినప్పటికీ అవన్నీ నిబంధనల మేరకు లేనందున తిరస్కరించబడ్డాయి. తద్వారా బరిలో నిలిచిన నీలం సంజీవరెడ్డి ఎన్నిక లేకుండా ఏకగ్రీవంగా ఎన్నికైన ఏకైక రాష్ట్రపతిగా నిలిచాడు.

15. భారత రాష్ట్రపతిగా అత్యధిక సార్లు పోటీచేసిన వ్యక్తి?
1) బాబు రాజేంద్రప్రసాద్
2) సర్వేపల్లి రాధాకృష్ణన్
3) నీలం సంజీవరెడ్డి 4) చౌదరి హరిరామ్

జ. 4;

వివరణ: హరియాణ రాష్ట్రం రోహ్‌తక్‌కు చెందిన రైతు నాయకుడు చౌదరి హరిరామ్ అత్యధిక సార్లు రాష్ట్రపతిగా పోటీ చేసిన వ్యక్తిగా రికార్డ్ సృష్టించాడు. ఇతను 1952, 1957, 1962, 1967, 1969లో వరుసగా 5 సార్లు పోటీ చేసినప్పటికి రాష్ట్రపతిగా ఎన్నిక కాలేదు. 1952లో నాల్గో స్థానంలో, 1957లో రెండో స్థానంలో, 1962లో రెండో స్థానంలో నిలువగా, 1967 ఎన్నికల్లో ఒక్క ఓటు కూడా రాలేదు. 1969లో 8వ స్థానంలో నిలిచాడు. బాబు రాజేంద్రప్రసాద్ 1952, 1957లో రెండుసార్లు పోటీచేసి రెండుసార్లు రాష్ట్రపతిగా ఎన్నికయ్యాడు. నీలం సంజీవరెడ్డి కూడా రెండు సార్లు పోటీచేస్తే 1969లో వి.వి.గిరి చేతిలో ఓడిపోగా; 1977లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

epaper.sakshi.com